సాక్షి ప్రకాశం

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



వేగంగా మెడికల్ కాలేజీ పనులు

మార్కాపురంలోని రాయవరం వద్ద మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. కాలేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. - 8లో..



భగ్గుమంటున్న 'పచ్చ'గడ్డి

యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీలో నాయకుల మధ్య రచ్చ తారస్థాయికి చేరింది. కేడర్‌లో ఊపు లేకపోగా, నాయకుల మధ్య విభేదాలు బయటపడుతున్నాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
42 /24

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

ఇఫ్తార్ : సా. 06:31 ని.
గురువారం

సహర్ : ఉ. 04:29 ని.
శుక్రవారం

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

మంత్రిని కలసిన జేసీ శ్రీనివాసులు



మంత్రి సురేష్‌కి బొకే అందిస్తున్న జేసీ శ్రీనివాసులు

మార్కాపురం: జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు బుధవారం మార్కాపురంలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను క్యాంప్ కార్యాలయంలో కలసి బొకే అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జేసీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి సమస్యలపై మంత్రి సురేష్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ సేధు మాధవన్ ఉన్నారు.

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

ఒంగోలు: పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం ఆరుగురికి స్థాన చలనం కలిగింది. విజయవాడ 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎం.సుధను చీరాల సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎం.శుభవాణిని పర్చూరుకు, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎం.కుముదునిని గుంటూరు 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్‌నాయుడ్ని కాకినాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఎస్.హేమలతను ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.జయలక్ష్మిని కదిరి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు.

మూల్యాంకన విధులకు హాజరుకాని వారికి తాఖీదులు

ఒంగోలు: మూల్యాంకన విధులకు ఉత్తర్వులు పొంది విధులకు హాజరుకాని సిబ్బందికి తాఖీదులు జారీ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉత్తర్వులు ఉన్నవారిని మాత్రమే మూల్యాంకన క్యాంపులోకి అనుమతిచ్చారు. మూల్యాంకనం చేసేందుకు ఆసక్తి ఉండి, ఉత్తర్వులు రాని కొంతమంది తమ ఆసక్తిని చూపడంతో వారికి అప్పటికప్పుడే ఉత్తర్వులు జారీ చేశారు. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌ను జిల్లా పరిశీలకుడు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. 253 మంది చీఫ్ ఎగ్జామినర్లకు గాను 214 మంది, 253 మంది స్పెషల్ అసిస్టెంట్లకు 212 మంది, 759 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌కుగాను 655 మంది మాత్రమే హాజరయ్యారని, ఈ నేపథ్యంలో చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 190 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 98 మందికి డీఈవో పి.రమేష్ తాఖీదులు జారీ చేశారు. ఆర్డర్ పడి విధులకు హాజరుకాని ఆంగ్లం, సోషల్ స్టడీస్, బయాలజీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి క్యాంపు ఆఫీసరు ముందు హాజరయ్యేటట్లు చూడాలని హెచ్‌ఎంలను ఆయన ఆదేశించారు.

నాడు టీడీపీ పాలనలో కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా, అభివృద్ధిలో అట్టడుగున ఉన్న పశ్చిమ ప్రకాశం నేడు రూపు రేఖలు మార్చుకుంటోంది. వైఎస్సార్ సీపీ పాలనలో వేలకోట్లతో అభివృద్ధి పరుగులు తీస్తోంది. పుష్కలంగా అందుతున్న సాగునీటితో సస్యశ్యామలమైంది. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు యజ్ఞంలా సాగుతున్నాయి. ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలు, తాగునీటి పథకాలు, రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, నాడు-నేడుతో పాఠశాలలు, వైద్యశాలల ఆధునికీకరణ, మెడికల్ కాలేజీ, గిరిజన సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వంటి శాశ్వతమైన అభివృద్ధి పనులతో పాటు.. మారుమూల గిరిజన గూడేల్లో ఉన్న పేద కుటుంబాలకు కూడా సంక్షేమ ఫలాలు వలంటీర్ల వ్యవస్థతో ఇంటింటికీ చేరుతున్నాయి.

- సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా సీఎం జగన్ ప్రభుత్వ పాలన
- గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం లో పరుగులు తీస్తున్న అభివృద్ధి పనులు
- సస్యశ్యామలంగా పశ్చిమ ప్రకాశం
- సంక్షేమ పథకాలూ రూ.వేల కోట్లలోనే
- గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ ఫలాలు



1. కొనకనమిట్లలో నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్
2. పొదిలిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం
3. గిద్దలూరులో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
4. వైపాలెం నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామమైన పాలుట్లలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం

రూ. 3,500 కోట్లతో అభివృద్ధి యజ్ఞం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గతంలో కరువుతో అల్లాడిన పశ్చిమ ప్రకాశం నేడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పశ్చిమ ప్రకాశంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువుతో కటకటలాడిన ఆ ప్రాంతం నేడు సస్యశ్యామలంగా మారింది. పాడి, పంటలతో పశ్చిమ ప్రకాశం పచ్చదనాన్ని సంతరించుకొని కళకళలాడుతోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో దాదాపు రూ.3,500 కోట్లకుపైగా అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందంటే ప్రభుత్వం పశ్చిమ ప్రకాశంపై ఎంతటి శ్రద్ధ చూపుతోందో అర్థమవుతోంది. రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు కొన్ని పూర్తికాగా మరికొన్ని కొన సాగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో మాయ మాటలు, అబద్ధపు వాగ్దానాలతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పబ్బం గడుపుకున్నాడు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో జిల్లాకు ఐదుసార్లు మాత్రమే వచ్చారు. వచ్చిన ప్రతిసారీ కబుర్లు చెప్పి వెనుతిరిగేవాడు. ఇక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటి వరకు జిల్లాకు 10 సార్లు వచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులపై సమీక్షించేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్, తరువాత పలు సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు బదిలీ పథకాలను ప్రారంభించేందుకు వచ్చారు. ఒక పక్క అభివృద్ధి పథకాలకు వేల కోట్లు ఖర్చు చేస్తూనే మరో పక్క సంక్షేమ పథకాలకు నేరుగా డెరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా వేల కోట్ల రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ అటు అభివృద్ధి ఇటు సంక్షేమ రెండు కళ్లలా చూసుకుంటూ పాలన సాగిస్తున్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చి ఆదుకుంటున్నారు. మారుమూల నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజనులకు, తండాల్లో నివాసం ఉంటున్న వారికి సైతం ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి.

రూ.230 కోట్లతో గిద్దలూరులో..

గిద్దలూరు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో మొత్తం రూ.230 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. జలజీవన్ మిషన్ ద్వారా మారుమూల గ్రామాలకు మంచినీటిని అందించేందుకు దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి పథకాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాలతో పాటు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు దాదాపు రూ.130 కోట్లు ఖర్చు చేశారు. నాడు-నేడు కింద రెండు ఫేజుల్లో పాఠశాలల భవనాల ఆధునికీకరణకు రూ.50 కోట్లు, రెండు విద్యుత్ సబ్ స్టేషన్లకు రూ.4 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు, పాతాళ నాగేశ్వర స్వామి, నెమలిగుండ్ల రంగ నాయక స్వామి ఆలయాల అభివృద్ధి కోసం రూ.2.15 కోట్లు, అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలకు రూ.2.40 కోట్లు, రూరల్ పీహెచ్‌సీల ఆధునికీకరణకు రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. జగనన్న కాలనీల ద్వారా సొంత ఇంటి కల నెరవేర్చేందుకు నిరుపేదలకు దాదాపు 9 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

రూ.1,525 కోట్లతో మార్కాపురంలో అభివృద్ధి పనులు

మార్కాపురం నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.1525 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి కాగా మరి కొన్ని పనులు జరుగుతున్నాయి. వాటిలో ప్రధానంగా మార్కాపురంలో మెడికల్ కాలేజి నిర్మాణం, వైద్యశాలల అభివృద్ధికి రూ.482 కోట్లు మంజూరయ్యాయి. తాగు నీటి సమస్య నివారణకు రూ.22.40 కోట్లు, పొదిలి పెద్దచెరువు అభివృద్ధికి రూ.50.13 కోట్లు, 3 సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.9.50 కోట్లు, చెన్నకేశవస్వామి ఆలయ రాజగోపురాల నిర్మాణానికి రూ.2 కోట్లు, నాడు-నేడు ఫేజ్ -1, 2 లో పాఠశాలల అభివృద్ధికి రూ.48 కోట్లు, ఆర్‌అండ్‌బీ పరిధిలో రోడ్లు, రిపేర్లు, ఎన్‌డీబీ వర్కులకు రూ.22 కోట్లు, పంచాయతీరాజ్ పరిధిలో సచివాలయాలు, సచివాలయ భవనాలు, సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్ల ఏర్పాట్లకు, మరమ్మతులకు రూ.150 కోట్లు, వాటర్ గ్రిడ్, ఇంటెక్ వెల్ ట్యాంక్ నిర్మాణానికి జల జీవన్ మిషన్ కింద తాగునీటికి రూ.720 కోట్లు విడుదల చేశారు. అందుకు సంబంధించిన పనులు కొన్ని పూర్తి కాగా మరికొన్ని జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని మార్కాపురం టౌన్, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలో 16 వేల మందికి ఇంటి పట్టాలు ఇవ్వటంతో పటు ఇంటి నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు వద్ద ఏపీఐఐసీకి 120 ఎకరాలు కేటాయించారు. కలుజువ్వలపాడు దగ్గర రూ.5 కోట్లతో మిల్లెట్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. మార్కాపురంలో అంబేడ్కర్ భవన్‌కు రూ.40 లక్షలు, బీసీ భవన్‌కు రూ.40 లక్షలు మంజూరు చేశారు. పొదిలి మెయిన్ రోడ్డు వెడల్పు, డ్రైన్స్, కాలువలు, డివైడర్ల ఏర్పాటుకు రూ.11 కోట్లు మంజూరు చేశారు.

రూ.1,774 కోట్లతో యర్రగొండపాలెంలో అభివృద్ధి పనులు

యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.1,774 కోట్లతో అభివృద్ధి పనులు కొన్ని పూర్తికాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పుల్లలచెరువు మండలంతో పాటు పరిసర మండలాలకు వరికపూడిసెల ప్రాజెక్టు ఒక వరంగా మారింది. పల్నాడుతో పాటు పుల్లలచెరువు మండలానికి అటు తాగు ఇటు సాగునీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టు పనులు మొదటి విడత సాగుతున్నాయి. మొత్తం రూ.1500 కోట్లతో రెండు విడతల్లో పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పుల్లలచెరువు మండల ప్రజల చిరకాలం స్వప్నం నెరవేరనుంది. తీగలేరు కాలువపై టీ-5 పనులు చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.83.78 కోట్లు మంజూరు చేసింది. రైతులకు వ్యవసాయానికి పగటి పూటే 9 గంటలు విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు రంగన్నపాలెం వద్ద 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేసింది. అందుకోసం రూ.127.20 కోట్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని 11 ప్రధాన రోడ్లకుగాను దాదాపు రూ.12 కోట్లు మంజూరు చేసింది. కొన్ని రోడ్ల పనులు పూర్తి కాగా మరికొన్ని పనులు వేగంగా జరుగుతున్నాయి.

నేను మీవాడిని..శ్రేయోభిలాషిని

- మీకు జీవితాంతం రుణపడి ఉంటాను
- ముస్లింల సమస్యల పరిష్కరిస్తా
- రూ.3 కోట్లతో షాదీఖానా త్వరలోనే పూర్తి చేస్తా
- ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ''నేను మీ వాడిని...మీ శ్రేయోభిలాషిని.. ఐదు సార్లు ఒంగోలు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో కీలకపాత్ర వహించిన మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోను...మీకు జీవితాంతం రుణపడి ఉంటాను'' అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలకు బుధవారం స్థానిక సెయింట్ థెరెస్సా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సంప్రదాయ దుస్తులు ధరించి వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉంటారని, వారు చేసే దువాను అల్లా ఆలకిస్తాడని అన్నారు. అందరికీ మనస్ఫూర్తిగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు. ఇలాంటి పవిత్రమైన కార్యక్రమంలో రాజకీయాలు మాట్లాడకూడదని కానీ ఇటీవల స్థానిక టీడీపీ నాయకుడు చెప్పిన అబద్ధాలకు సమాధానం ఇవ్వక తప్పడం లేదన్నారు. కరోనా సమయంలో ఇస్లాంపేటలో రెడ్‌జోన్ విధించినప్పుడు సదరు టీడీపీ నాయకుడు ఎక్కడికి పోయాడో చెప్పాలని నిలదీశారు. కరోనా సమయంలో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతుంటే కనిపించకుండా పోయిన ఆయన ఇప్పుడు వచ్చి నాటకాలాడుతున్నాడని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన షాదీఖానాను పూర్తి చేయడానికి ఎలాంటి పనులు చేయకుండా గత ఎన్నికల ముందు షాదీఖానా ప్రారంభించాడని విమర్శించారు. రూ.3 కోట్ల నిధులతో త్వరలో షాదీఖానా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. శ్మశానవాటికి విషయంలో కోర్టు ద్వారా అడ్డంకులు సృష్టించింది ఎవరో ముస్లింలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. 23వ డివిజన్‌లో శిథిలావస్థలో ఉర్దూ పాఠశాల స్థానంలో కొత్తగా ఉర్దూ పాఠశాల, కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. టీడీపీ నాయకులు మసీదులను కూల్చే పనిలో ఉంటే మేము నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ముస్లిం సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. ముస్లింల అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వారితో కలిసి ఆయన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఇఫ్తార్ తరువాత జరిగిన నమాజులో పాల్గొని ప్రార్థనలు చేశారు. మౌలానా సలీం దువా చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, ఇంతేజార్, రాష్ట్ర ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరక్టర్ బాషా, కో ఆప్షన్ మెంబర్ నజీర్ అహ్మద్, షౌకత్ అలి, తబ్లీగ్ జమాయత్ జిల్లా బాధ్యులు సయ్యద్ హమీద్, షేక్ వాజిద్, సీనియర్ నాయకులు ఖాదర్ బాష, ఖుద్దూస్, జాని, షేక్ ఇందాత్ (బుజ్జి), షేక్ మున్నా, షేక్ బాచితోపాటు పలువురు ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కటారి శంకర్, వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ చిడితోటి జీవన్, నాయకులు గొర్రెపాటి శ్రీను, ఘనశ్యాం, షాజహాన్ తదితరులు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి జగనన్న



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రాజకీయంగా ఎదిగేందుకు సీఎం తన క్యాబినేట్‌లో మహిళలకు అగ్రస్థానం కల్పించారని అన్నారు. మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తమ ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తుందని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే బ్యాంకర్లు రెట్టింపు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తారని అన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని సూచించారు. విరివిగా రుణాలు ఇచ్చి వ్యాపారపరంగా మహిళలను ప్రోత్సహిస్తున్న యర్రగొండపాలెం, అమానిగుడిపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు ఎస్.చంద్రశేఖర్, జి.నాగరాజులను మంత్రి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద మంజూరైన రూ.10.50 లక్షల విలువచేసే 10 యూనిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఏపీఎం ఎం.వెంకిరెడ్డి, శ్రీనిధి మేనేజరు ఎం.నరేంద్ర, సీసీలు ఇబ్రహీం, జ్యోతి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర రెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాబు ఫ్లాప్ షో

- మూడు రోజుల పశ్చిమ ప్రాంత పర్యటనలో మొదటి రోజే వెలవెలబోయిన చంద్రబాబు సభ
- ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగిన జనం
- సభా ప్రాంగణంలో మద్యం మత్తులో జోగిన తెలుగు తమ్ముళ్లు

గిద్దలూరు రూరల్: ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పశ్చిమ ప్రాంత పర్యటనలో మొదటి రోజు బుధవారం గిద్దలూరులో ఏర్పాటు చేసిన సభ అట్టర్ ఫ్లాప్ అయింది. సభా ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది. వాహనాలు పెట్టి, మద్యం, డబ్బు ఆశచూపి తరలించిన అరకొర జనం కూడా చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగం వినలేక మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు ప్రసంగం ఆరంభంలోనే అబద్ధాలతో మొదలుపెట్టారు. గిద్దలూరుకు తాను ఎన్నోసార్లు వచ్చానని చెప్పడంతో ప్రజలు విస్తుపోయారు. ముందుగా ఆదిమూర్తిపల్లె నుంచి గిద్దలూరు గాంధీబొమ్మ సెంటర్, రాచర్లగేటు సెంటర్ల మీదుగా ఒంగోలు హైవే రోడ్డులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకున్నారు. రాచర్ల గేటు సెంటర్‌లో చంద్రబాబుకు గజమాల వేసేందుకు ఏర్పాటు చేయడంతో ఆ సెంటర్‌లో రైల్వే గేటు వేయడం వల్ల జనాలు ఎక్కువగా నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సభా ప్రాంగణం ఆవరణలో విచ్చలవిడిగా మద్యం పోస్తూ మద్యం ప్రియులు అక్కడే ఉండేలా చేశారు. తక్కువ జనం వచ్చినా కూడా ఎక్కువ జనం కనపడేలా సభా ప్రాంగణ స్థలం చిన్నది ఎంచుకుని సభను అక్కడే ఏర్పాటు చేశారు. కొందరు టీడీపీ కార్యకర్తలు మద్యం తాగుతూ విచ్చలవిడిగా ప్రవర్తించారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా మద్యం మత్తులోని కొందరు యువకులు ఇష్టానుసారంగా ప్రవర్తించారు. పోలీసులు వారిని వారించి పక్కకు పంపించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బైక్‌ల పై ప్రమాదకరంగా తిరుగుతుండటంతో పోలీసులు వారిని అదుపుచేయగా వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఓటు హక్కు లేని చిన్నారుల చేతికి టీడీపీ జెండాలను ఇచ్చి మరీ వాహనాల పైకి ఎక్కించి ప్రచారం చేయించారు. సభలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సాయికల్పన దూరం

గిద్దలూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీలో వర్గ పోరు బట్టబయలైంది. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి తనకు తగిన మర్యాద ఇవ్వకపోగా చంద్రబాబు వస్తున్న విషయం ఒక్క రోజు ముందుగా సమాచారం అందిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసి బాబు పర్యటనకు దూరంగా ఉండిపోయారు. ''ఇదేం ఖర్మ నాకు ఎవరినో ఎమ్మెల్యేను చేయడానికి నేను తిరగాలా'' అంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీలో నన్ను కరివేపాకులా వాడుకుని వదిలేస్తారా అంటు మండిపడుతున్నారు. దీంతో ఆమె వర్గీయులు సైతం చంద్రబాబు సభకు దూరంగానే ఉండిపోయారు. మరో వైపు నియోజకవర్గంలో అత్యధిక ఓటు శాతం కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందిన పెట్టెల నారాయణయాదవ్ తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలంటూ నియోజకవర్గంలో తిరుగుతూ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డికి దూరంగా ఉంటున్నారు. అందులో భాగంగానే తాను తన వర్గీయులతో ఆదిమూర్తిపల్లె సమీపంలోనే చంద్రబాబును కలిశాడు. బీసీలకు న్యాయం చేయాలంటూ కోరినట్లు సమాచారం.



చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న జనం



అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా అడ్డుగా ఉన్న చంద్రబాబు వాహన శ్రేణి





సభా ప్రాంగణంలో మద్యం మత్తులో పడి ఉన్న టీడీపీ కార్యకర్తలు

వేగంగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు


మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

● కలెక్టర్ దినేష్‌కుమార్

మార్కాపురం: మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద మెడికల్ కాలేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన మెడికల్ కాలేజీ ఆసుపత్రి, హాస్టల్, ఇతర భవనాల నిర్మాణ పనులను పరిశీలించి అక్కడే సమీక్షించారు. రోజుకు 150 మంది వరకు కూలీలు నిర్మాణ పనులు చేస్తున్నారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యమైన ఆసుపత్రి, కాలేజ్, హాస్టల్ భవన నిర్మాణాల ఫౌండేషన్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ పనుల్లో జాప్యం జరుగుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఎస్ఈని ఆదేశించారు. వర్షాలు మొదలయ్యే నాటికి ఇసుకకు ఇబ్బంది లేకుండా 30 నుంచి 40 వేల టన్నులు నిల్వ చేయాలని సూచించారు. ప్రతి నెలా నిర్మాణ పనుల్లో పురోగతి ఉండాలని చెప్పారు. కాలేజీ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు కలెక్టర్‌ను కలవగా తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎకరాకు రూ.3 లక్షల చొప్పున ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తుందని చెప్పారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ సేథు మాధవన్, ఈఈ రవి, మేఘా సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న 'పచ్చ' గడ్డి!





● వైపాలెంలో నాలుగు వర్గాలుగా తెలుగు తమ్ముళ్లు..
● పార్టీ అధినేత వస్తున్నా ఆగని కుమ్ములాటలు
● చంద్రబాబు వద్ద అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధం
● మన్నె రవీంద్ర, ఎరిక్షన్‌బాబు మధ్య తారాస్థాయికి వర్గపోరు
● ఇద్దరి మధ్య సయోధ్యకు పార్టీ జిల్లా నాయకుల యత్నాలు
● గత ఎన్నికల్లో ఓడిన బూదాల అజిత, మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు చెరో కుంపటి
● బాబు విసిరిన బిస్కెట్లకు కక్కుర్తి పడిన డేవిడ్ రాజుకు ఈసారీ మొండిచేయేనా?

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. కేడర్‌లో పస లేకపోయినా సీటు విషయమై నాలుగు వర్గాలుగా నాయకులు విడిపోయారు. నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత కుమ్ములాటలు పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనతో ఒక్కసారిగా బయటపడ్డాయి. పార్టీ అధిష్టానం ఆదేశించిన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రథమ, ద్వితీయ శ్రేణి నాయకులు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తూ వస్తున్నారు. శుక్రవారం యర్రగొండపాలెంలో ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు వస్తుండటంతో ఆయన వద్దే అమీతుమీ తేల్చుకునేందుకు నేతలు సిద్ధమయ్యారు.

మన్నె రవీంద్ర × ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం నియోజకవర్గంలో నాలుగు వర్గాలుగా చీలిన టీడీపీ నేతలు ఎవరిదారి వారిదే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు అంటీ ముట్టనట్లు ఉన్న టీడీపీలోని సీనియర్ నాయకుడు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర, టీడీపీ నియోజకర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు మధ్య వర్గపోరు పెల్లుబికింది. దీంతో టీడీపీకి చెందిన జిల్లా నాయకులు వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు గత రెండు, మూడు రోజులుగా విశ్వ ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. తొలివిడతలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామితో పాటు గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నాయకులు యర్రగొండపాలెం వెళ్లి మరీ ఇరువురితో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. అయినా వినకపోయే సరికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వెళ్లి ఇరువురితో మాట్లాడినట్లు తెలుస్తోంది. అయినా వారిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలు కాస్తా ఫ్లెక్సీల వివాదం వరకు వెళ్లినట్లు సమాచారం.

బూదాల అజిత × డేవిడ్‌రాజు

2019 సాధారణ ఎన్నికల్లో యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఘోర పరాజయం చవిచూసిన బూదాల అజితారావు నాటి నుంచి నేటి వరకు పార్టీ ఊసే లేకుండా, కేడర్‌కు కూడా కనపడకుండా దూరంగా ఉన్నారు. గత నాలుగేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన బూదాల అజితారావు 2019 ఎన్నికల వేళ ప్రత్యక్షమయ్యారు. పార్టీ ఆమెను పక్కన పెట్టినప్పటికీ తనకంటూ ఒక వర్గం ఉందంటూ యర్రగొండపాలెం వస్తున్న అధినేత చంద్రబాబు వద్ద బలప్రదర్శన చేసేందుకు సిద్ధమయ్యారు.

2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున బరిలోకి దిగి ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన పాలపర్తి డేవిడ్‌రాజు.. చంద్రబాబు విసిరిన డబ్బుకు కక్కుర్తిపడి పచ్చ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో టికెట్ తనదేనని భావించిన డేవిడ్ రాజుకు చంద్రబాబు మొండిచేయి చూపారు. తాజాగా డేవిడ్ రాజు కూడా ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని ఈసారైనా తనకు టిక్కెట్ ఇవ్వండని ప్రాధేయపడేందుకు సిద్ధమయ్యారు. తనకు టికెట్ ఇవ్వకపోయినా తన కోడలుకు పోటీచేసే అవకాశం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చుట్టూ తిరుగుతున్నట్లు పార్టీ కేడర్‌లో గుసగుసలు వినపడుతున్నాయి.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014లో తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగే సమయంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నూకసాని బాలాజీని యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయించారు. వాస్తవంగా ఈ మండలం ఓసీలకు కేటాయించినప్పటికీ.. బీసీ సామాజిక వర్గానికి చెందిన బాలాజీని మండల ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. అప్పటి రాజకీయ పరిణామాల దృష్ట్యా ఆయన జెడ్పీ వైస్ చైర్మన్‌గా కొన్నాళ్లు పనిచేశారు. అప్పటి అధికార టీడీపీలో పెత్తనం చెలాయించే ఉద్దేశంతో పచ్చ కండువా కప్పుకున్న బాలాజీ ప్రస్తుతం జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గం తన గుప్పెట్లో ఉన్నట్లు భావిస్తూ కనిగిరి ప్రాంతానికి చెందిన ఎరిక్షన్‌బాబును నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగేలా సహకరించారు. ఇదిలా ఉండగా రాజకీయాలపై అంతగా అవగాహన లేని యువ వైద్యుడు డాక్టర్ అనిల్‌కుమార్ స్థానికత నినాదంతో తనకూ ఒక వర్గం ఉందంటూ చెప్పుకుంటున్నారు.

మహిళా పోలీసుల సేవలు భేష్

● పదిమంది మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు
● ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేక అభినందనలు


ప్రశంసాపత్రాలు పొందిన మహిళా పోలీసులతో ఎస్పీ మలికా గర్గ్, ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన

ఒంగోలు టౌన్: జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టడంలో మహిళా పోలీసులు క్రియాశీలకంగా పనిచేస్తున్నారని ఎస్పీ మలికా గర్గ్ అభినందనలు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 10 మంది మహిళా పోలీసులకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలతో పాటుగా బాల్య వివాహాల నివారణ, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానం, ఇతరా అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీసీ కెమెరాల గురించి ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసు శాఖ ఇచ్చిన ఐడెంటిఫికేషన్ నంబర్లు లేని ఆటోలను గురించి తమ పరిధిలోని పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. నగరంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి సమాచారం సేకరించాలన్నారు. దిశ యాప్ డౌన్లోడ్ చేయించాలని, సైబర్ నేరాలు, జాబ్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పోలీసుల శాఖ ప్రతినిధిగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూనే మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణే ధ్యేయంగా మహిళా పోలీసులు పనిచేయాలని ఆదేశించారు. పోలీసు శాఖకు మంచిపేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, డీఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ప్రశంసా పత్రాలు పొందిన మహిళా పోలీసులు

టి.రాజేశ్వరి (చీమకుర్తి పోలీసు స్టేషన్), ఏ.వాణి (ఒంగోలు వన్ టౌన్), కె.సాయి నిరుపమ (ఒంగోలు వన్‌టౌన్), జి.గిరిజ (పొన్నలూరు పీఎస్), ఎం.శ్రావణి (మార్కాపురం టౌన్)

మార్చిలో ప్రశంసా పత్రాలు పొందిన మహిళా పోలీసులు

జి.మౌనిక (గిద్దలూరు పీఎస్), ఎం.స్వర్ణలత (పొన్నలూరు పీఎస్), ఎస్.అశ్విని (గిద్దలూరు పీఎస్), వి.రేణుక (గిద్దలూరు), ఈ.జయకమల (మార్కాపురం టౌన్)

ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు


ఘటన జరిగిన బావిని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ, ఇన్‌సెట్‌లో పూజిత మృతదేహం

● బాలిక ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై

దర్శి: రిక్షా నేర్చుకుంటూ నేలబావిలో పడి బాలిక మృతి చెందడం బాధాకరమని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. బొట్లపాలెంకు చెందిన కాట్రాజు సుబ్బారావు కుమార్తె పూజిత(13) సరదాగా రిక్షా నేర్చుకుంటూ నేల బావిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఎస్సై రామకృష్ణ బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు, అందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇలాంటి బావులు ఎన్ని ఉన్నాయి, వాటి వివరాలు గ్రామ సచివాలయం మహిళా పోలీస్‌ల ద్వారా సేకరిస్తున్నారు. సంబంధిత కార్యదర్శులు, వీఆర్వోలతో మాట్లాడి ఆ బావులు ప్రమాదకరంగా ఉంటే వాటికి కంచెలు వేయించడం, పనికిరాని బావులు ఉంటే పూడ్చేందుకు ఉన్నతాధికారులతో సంప్రదించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తల్లిదండ్రులు పిల్లలను ఈతలకు, బావుల వద్దకు ఆటలకు, ప్రమాద కర పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు పంపవద్దని సూచించారు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన బావి వైపునకు ఎవ్వరూ వెళ్లకుండా కంచె ఏర్పాటు చేస్తామని చెప్పారు. బాలిక మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. బాలిక మృతితో గ్రామం శోకసంద్రంలో మునిగింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడాన్ని గ్రామస్తులు సైతం జీర్ణించుకోలేక పోతున్నారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

● కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
● భారీగా పాల్గొన్న ముస్లింలు

కనిగిరి రూరల్: రంజాన్‌ను పురస్కరించుకుని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి భారీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక అలీ మసీద్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులతో సర్వమానావళి సంతోషంగా ఉండాలన్నారు. రంజాన్ నెలలో అత్యంత పవిత్రంగా, నిష్టతో ఆచరించే ఉపవాస దీక్షలను కొనియాడారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను మంచి మనస్సుతో రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు ఎంతో అండగా నిలిచిందని తెలిపారు. ఎన్ని అడ్డంకులొచ్చినా కనిగిరిలో అబ్దుల్ గఫార్‌ను చైర్మన్‌గా చేశానని తెలిపారు. గత ప్రభుత్వం ముస్లింలను తీవ్ర మోసం చేసిందన్నారు. అనంతరం ఇఫ్తార్ విందు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ముఫ్తి, మౌలాన, ఇమామ్‌లతో కలిసి ప్రత్యేక దువా చేశారు. ముస్లింలకు రంజాన్ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అలీ మసీద్ పక్కన ఉన్న స్థలాన్ని న్యాయసమస్యలు పరిష్కరించి షాదీఖానా ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, పార్టీ మైనార్టీ నాయకులు ఎస్కే జిలానీ, షఫీ ఆజాద్, ఖాజా, మీరావలి, డాక్టర్ రసూల్, జానీ, షరీఫ్, ఎస్కే ఫయాజ్, రహిమాన్, నాగూర్ వలి, చాంద్ బాషా, మన్సూర్, సయ్యద్ నాయబ్ రసూల్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

● కలెక్టర్ దినేష్‌కుమార్


ఈవీఎం గోదాములు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈవీఎం, ఇతర ఓటింగ్ యంత్రాలకు పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాడ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోదాము లోపల పరిస్థితులను గమనించారు. గోదాము తాళాలకు సీళ్లు సక్రమంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామిశెట్టి శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు గుర్రం సత్యనారాయణ, ఎస్కే రసూల్, కాలేషాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి


వేమా జయశ్రీ మృతదేహం


పాపప్రాణం తీసిన నీటి తొట్టి

కురిచేడు: నీటి తొట్టిలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని బోధనంపాడులో బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు..గ్రామానికి చెందిన వేమా సుబ్బారావు, అనూషల ఏకైక సంతానం వేమా జయశ్రీ(2) రోజులాగే బుధవారం సాయంత్రం ఆడుకుంటూ ఇంటి ఆవరణలోని ఉన్న నీటి తొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు తొట్టిలో పడిపోయింది. ఆ సమయంలో ఎవ్వరూ గమనించలేదు. కాసేపు తరువాత పాపను వెతుకుతూ బయటకు వచ్చే సరికి పాప నీటితొట్టిలో శవమై తేలింది. దీంతో తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తును చిన్నారిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ఇంటి వద్దకు చేరుకున్నారు.

రక్తహీనతపై జిల్లా వ్యాప్తంగా సర్వే


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

మార్కాపురం టౌన్/పొదిలి రూరల్: రక్తహీనత, పోషకాహార లోపానికి గల కారణాలపై జిల్లా వ్యాప్తంగా సర్వే చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రైవేటు వైద్యశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పొదిలి మండలం ఉప్పలపాడులో డైట్ న్యూట్రిషన్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. కలెక్టర్ వ్యక్తిగత చొరవతో రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో డైట్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ రాహుల్, డాక్టర్ సుగుణకుమార్, సిబ్బంది ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

దర్శి: ఇంట్లో మందలించారని క్షణికావేశంలో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తూర్పు వీరాయపాలెంలో జరిగింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ముప్పరాజు రమణయ్య కుమారుడు గిరి(37) భార్య, పిల్లలను పట్టించుకోకుండా తిరుగుతూ ఆస్తి పంపకాలు చేయాలని వత్తిడి చేస్తున్నాడు. దీంతో తల్లిదండ్రులు మద్యం మానేసి భార్య పిల్లలతో సక్రమంగా కాపురం చేస్తేనే ఆస్తి పంచి ఇస్తామని చెప్పారు. దీంతో మనస్తాప చెంది పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.